క్లుప్తంగా

కార్తీకమాసం సందర్భంగా శివుడికి అన్నపూజ


హాజరైన భక్తులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం స్వామివారికి అన్నపూజ నిర్వహించడంతోపాటు ప్రత్యేక అలంకరణ చేశారు. పలువురు భక్తులు స్వయంగా కూరగాయలు తరగడంతోపాటు అన్నదానానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. వీరభద్ర స్వామి వాసవీమాత శివుడికి వీర హనుమాన్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం హాజరైన భక్తులందరికీ తీర్థప్రసాదాలను పూజారులు రమేశ్, మహేశ్ అందజేశారు. శివ భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, అల్లంకి ఆనందం పాల్గొన్నారు.

చెట్లపొదల్లో బోర్డు



ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామంలో లెవల్ క్రాసింగు గేట్ సమీపంలో ముళ్లపొదల్లో బోర్డు ఉంది. సుల్తానాబాద్ నుంచి కాల్వశ్రీరాంపూర్ రూట్లో కొలనూర్ బోర్డు పూర్తిగా కనబడకుండా చెట్లపొదల్లో ఉండడంతో ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. వెంటనే ఆర్అండ్‌బీ సిబ్బంది, రైల్వే సిబ్బంది చెట్లపొదలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేత్రదానం.. ఇద్దరికి చూపు


సర్టిఫికెట్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ముత్తారం: ముత్తారం మండలం లక్కారం మాజీ సర్పంచ్, మండల వైస్ ఎంపీపీ నాగుల మల్యాల లింగస్వామి(55) అనారోగ్యంతో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి నేత్రాలను దానం చేసి ఇద్దరికి చూపు ఇవ్వాలనే సంకల్పంతో లింగస్వామి సోదరుడు శ్రీహరి, భార్య లక్ష్మి, కుమారులు రాజశేఖర్, చంద్రశేఖర్ సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులు లగిశెట్టి చంద్రమౌళి తెలియజేశారు. ఎల్‌వీప్రసాద్ ఐ బ్యాంకు గోదావరిఖని ఐ రికవరీ టెక్నీషియన్ బాలు మృతుడి రెండు కార్నియాలను సేకరించి హైదరాబాద్ ఎల్‌వీపీకి పంపించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, చంద్రమౌళి, లింగమూర్తి తదితరులు అభినందనలు తెలిపారు.

నారుమడి సిద్ధం



ఓదెల: మండలంలో వరి సాగుకు రైతులు నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. మండలంలోని కొమిర, ఓదెల, పొత్కపల్లి, కొలనూర్, నాంసానిపల్లె, గుంపుల గ్రామాల్లో రైతులు వరినాటు కోసం నారుమళ్లను సాగు చేస్తున్నారు. మొలక అలికిన నెలరోజుల తర్వాత వరినాటు వేయడానికి సిద్ధం కానున్నారు.

పశువుల దాహార్తి తీరుస్తున్న నీటితొట్టె

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో ఏర్పాటు చేసిన నీటితొట్టె పశువుల దాహార్తి తీరుస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 2018లో రూ.17వేలతో నిర్మించారు. ఇప్పటికీ దాన్ని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రతిరోజూ నీటిని నింపడంతో పశువులకు, పక్షులకు దాహార్తి తీరుతోంది. ఇలానే ప్రతి గ్రామంలో నిర్మిస్తే పశువులు, పక్షులకు దాహార్తి తీరుతుందని పలువురు కోరుకుంటున్నారు.


పెద్దపల్లిరూరల్: విజయరమణారావును సన్మానిస్తున్న నాయకులు


ఓదెల: కొలనూర్‌లో సంబరాలు


యైటింక్లయిన్‌కాలనీ: విజయోత్సవ ర్యాలీలో ఎంఎస్ రాజ్‌ఠాకూర్


కమాన్‌పూర్‌లో విజయోత్సవ ర్యాలీ


పెద్దపల్లిరూరల్: పెద్దకల్వలలో బైక్ ర్యాలీ


జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంలో..


జూలపల్లిలో సంబరాలు

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో ఎన్నికైన విజయరమణారావును కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. తొలిరౌండ్ నుంచి పార్టీ అభ్యర్థి విజయరమణారావు ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. దీంతో నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు చెందిన విజ్జన్న అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీలు, విజయోత్సవ ప్రదర్శనలను నిర్వహించారు.

కమాన్‌పూర్: మంథని ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గెలుపుతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మండలంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివాం పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.

ధర్మారంలో..

ధర్మారం: ధర్మపురి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఘన విజయం సాధించడంపై ధర్మారం మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు.

ధర్మారం ఓటర్లు కాంగ్రెస్ వైపే..

ధర్మారం మండల ప్రజలు కాంగ్రెస్ వైపే మొగ్గుచుపారు. మండలవ్యాప్తంగా 29 గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత సాధించింది. మండలంలో 35,299 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోగా వాటిని నాలుగు రౌండ్లుగా విభజించారు. 10వ రౌండ్‌లో 1171 ఓట్లు, 11వ రౌండ్‌లో 2068 ఓట్లు, 12వ రౌండ్‌లో 1260 ఓట్లు, 13వ రౌండ్‌లో 1443ఓట్లు ఆధిక్యత సాధించింది. కేవలం ధర్మారం మండలంలోనే 5942 ఓట్ల ఆధిక్యం కాంగ్రెస్‌కు దక్కింది.

సుల్తానాబాద్‌రూరల్: పెద్దపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయరమణారావు, రాష్ట్రంలో మెజార్టీ సీట్లు కాంగ్రెస్‌కు రావడంతో సుల్తానాబాద్ మండలంలోని కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నిండింది. ఆదివారం మండలంలోని గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

ఓదెల: పెద్దపల్లి ఎమ్మెల్యేగా చింతకుంట విజయరమణరావు గెలుపొందడంతో మండలంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం మండలంలోని కొలనూర్, ఓదెల, మడక, పొత్కపల్లి, కొమిర, గుంపుల, పిట్టల ఎల్లయ్యపల్లె, కనగర్తి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ చేశారు.

విజయోత్సవ ర్యాలీ

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఆదివారం ఉదయం కౌంటింగ్ ప్రారంభానికి ముందు యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరు గ్రామంలోని దర్గాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన అనంతరం ఠాకూర్ అదే దర్గాను దర్శించుకొని విజయోత్సవ ర్యాలీ దర్గా అల్లూరు రోడ్ నుంచి ప్రారంభించి పోతనకాలనీ మీదుగా గోదావరిఖని వైపు వెళ్లారు.

జ్యోతినగర్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ రామగుండం అభ్యర్థిగా రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ విజయంపై పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్, మూడో డివిజన్ జంగాలపల్లె ప్రాంతాల్లో కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు.

పాలకుర్తి: రామగుండం, మంథని నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా కాంగ్రెస్ అభ్యర్థులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆదివారం పాలకుర్తి మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద పార్టీ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కన్నాల, జీడీనగర్, రాణాపూర్ గ్రామాల్లో సంబరాలు జరుపుకున్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఆదివారం టపాసులు కాల్చి, స్వీట్లు నంచి సంబరాలు జరుపుకున్నారు.


ధర్మారం: సంబరాల్లో నాయకులు


బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద..

జూలపల్లి: పెద్దపల్లి ఎమ్మెల్యేగా విజయరమణరావు విజయం సాధించడంతో మండలంలో సంబరాలు జరిపారు.

రామగుండం: రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్‌ఠాకూర్ భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయన అభిమానులు గెలుపు సంబరాల్లో మునిగారు. ఇందులో భాగంగానే మసీద్ కార్నర్ అంబేడ్కర్ చౌక్, రైల్వేస్టేషన్, కుందనపల్లి, అంతర్గాం మండల పరిధిలోని ప్రతీ గ్రామంలో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు.

ముత్తారం: కాంగ్రెస్ నుంచి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గెలుపొందడంతో ముత్తారం మండలం అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.


జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంలో సంబరాలు


రామగుండం: కాంగ్రెస్ సంబరాలు


కాల్వశ్రీరాంపూర్‌లో..


ముత్తారం: నృత్యం చేస్తున్న నాయకులు


ధర్మారం: విజయసంకేతం చూపిస్తున్న నాయకులు


సుల్తానాబాద్‌రూరల్: భూపతిపూర్‌లో సంబరాలు

ఉత్కంఠగా ఎన్నికల ఫలితాల వీక్షణ

జూలపల్లి: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రజల్లో తీవ్ర ఆసక్తిని రేపాయి. గత పది సంవత్సరాలు ఏకధాటిగా పాలించిన బీఆర్ఎస్ సంక్షేమ పథకాల అమలు పేరుతో, ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ఎన్నికల బరిలో నిలవగా ఓటర్లు ఎవరిని దీవించారో ఆదివారం కౌంటింగ్‌లో తేలనున్నందున గ్రామాల్లో టీవీలు, సెల్‌ఫోన్‌లలో వీక్షించారు.


ఫోన్‌లో ఫలితాలు చూస్తున్న యువకులు

కాంగ్రెస్ విజయం రాష్ట్ర ప్రజల విజయం



జ్యోతినగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ సంపూర్ణ విజయం సాధించడం రాష్ట్ర ప్రజల విజయమని ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లోని ఆయన నివాసంలో మాట్లాడారు. రామగుండం నియోజకవర్గంలో మక్కాన్‌సింగ్ విజయం, మంథనిలో శ్రీధర్‌బాబు, చెన్నూరులో వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లిలో వినోద్‌తో పాటు పెద్దపల్లిలో విజయరమణారావు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విజయం సాధించడంపై వారికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చి ప్రజల మన్ననలు పొందుతుందని ధీమా వ్యక్తం చేశారు.



కట్టెలు అమ్మితేనే.. కడుపు నిండేది!

కాల్వశ్రీరాంపూర్: కట్టెలు అమ్మితేనే.. ఆ సెంచు కుటుంబం కడుపు నింపుకుంటుంది. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన దేవయ్య - సమ్మక్క సెంచు దంపతులు. మైళ్ల దూరం అడవికి వెళ్లి ఎండిన కట్టెలు ఏరుకుని, మోపు కట్టుకుని ఊళ్లో హోటళ్లలో, గృహాల్లో విక్రయించి వారిచ్చిన డబ్బులతో నూకలు, దినుసులు కొనుగోలు చేసి పొట్టపోసుకుంటారు. ఎవరైన పాపం అని పిడికెడు అన్నం పెడితే ఎంతో సంతోషిస్తారు.

మల్లన్న సన్నిధిలో పూజలు


నందీశ్వరుని వద్ద పూజలు చేస్తున్న మహిళలు

ఓదెల: పెద్దపల్లి ఎమ్మెల్యేగా చింతకుంట విజయరమణరావు గెలిచినందుకుగాను ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఓదెల గ్రామానికి చెందిన మహిళలు ఆదివారం పూజలు చేశారు. అనంతరం మల్లికార్జునస్వామి, సీతరామచంద్రస్వామి, నందీశ్వరులను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు కొమల, తిరుమల, శారద, సుగుణ, లక్ష్మి, శోభ, సునంద పాల్గొన్నారు.

విజ్జన్నను కలిసేందుకు తరలిన నాయకులు

జూలపల్లి: పెద్దపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస పార్టీ తరపున భారీ మెజారిటీతో విజయం సాధించిన మాజీ ఎమ్మెల్యే విజయరమణారావును కలిసేందుకు మండల కేంద్రంతో పాటు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు పొట్టాల శంకరయ్య మాట్లాడుతూ పేదల పాలిట కాంగ్రెస్ అనుకూల వైఖరి, ఇందిరమ్మ రాజ్యం తెస్తామన్న నాయకుల వాగ్దానాలను ప్రజలు నమ్మి తిరుగులేని తీర్పు ఇచ్చారని అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన విజయరమణారావును కలిసేందుకు వెళ్లిన వారిలో లోక జలపతిరెడ్డి, శ్రీనివాస్, ఖాజమియా, లచ్చయ్య, కొమురయ్య ఉన్నారు.

ఎండుతున్న మొక్కలు

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాల పరిధిలోని కెనాల్ సమీపంలో రాజీవ్ రహదారి మధ్యలో నాటిన మొక్కలకు కాంట్రాక్టర్ నీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ఎండిపోతున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. వెంటనే వాటి స్థానంలో కాంట్రాక్టర్ మొక్కలు నాటించాలని సూచిస్తున్నారు.



కనువిందు చేస్తున్న ప్రకృతి నేస్తాలు


కనువిందు చేస్తున్న కొంగలు

కాల్వశ్రీరాంపూర్: పక్షులు ప్రకృతి నేస్తాలు అంటారు. పశు పక్ష్యాదులు ప్రకృతిలో లభించే ఆహారాన్ని తింటూ వాటి కడుపు నింపుకుంటూ ప్రకృతిలో అడవుల పెంపకానికి పంటపొలాల్లో జీవావరణ సమతుల్యతను పరిరక్షించి ప్రకృతికి, రైతులకు నేస్తాలుగా ప్రయోజనం చేకూరాయి. ప్రస్తుతం యాసంగి వరినాట్లు కోసం రైతులు దుక్కులు దున్నుతున్నారు. దీంతో దుక్కిలో ఉన్న క్రిమికీటకాలుపైకి రావడంతో కొంగలు వాటిని ఆహారంగా తినుకుంటూ ఆనందంగా ఉత్సాహంగా ఎగురుతూ ప్రకృతి ప్రేమికులను ఆహ్లాద పరుస్తున్నాయి. పాదచారులు, ప్రయాణికులు పంటపొలాల్లో కొంగల గుంపు ఎగిరే సందర దృశ్యాలను సెల్‌ఫోన్లలో సెల్ఫీలు తీసుకుంటున్నారు.

కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారేది?



సుల్తానాబాద్: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌కి వెళ్లే రహదారి మధ్యలో విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ అధికారులు ఇటీవల వేశారని కూరగాయల సంతకు వెళ్లే ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలకు అనుకూలంగా విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయకుండా రోడ్డుకు మధ్యలో వేయడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. వెంటనే తొలగించి పక్కన వేయాలని ప్రజలు కోరుతున్నారు.